సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 10 । అక్టోబర్ । 2024



ముందు'చూపు' అవసరం..!
శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగినా ఆ బాధను కళ్లే వ్యక్తపరుస్తూ ఉంటాయి. వాటిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత. - IIలో



గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి
విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరగకుండా చూడాలని విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి పోలీస్ అధికారులను ఆదేశించారు. - IIలో

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు
పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) అనసబద్రలో 2024-25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన టీజీటీ తెలుగు గెస్ట్ టీచర్ పోస్టుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులం సెల్ పీటీపీ ఎట్‌దిరేట్‌ఆఫ్‌జీమెయిల్ డాట్ కామ్‌లో దరఖాస్తు పంపించాలన్నారు.

న్యూస్‌రీల్

పీఎంఈజీపీతో యువతకు ఉపాధి
పార్వతీపురం: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఈజీపీ కింద ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం, కాయర్ బోర్డ్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ పథకాలకు ప్రభుత్వ, సహకార బ్యాంకులు, ప్రైవేట్ రంగంలో ఉన్న షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకులు ఆర్థిక సహాయాన్ని అందిస్తాయన్నారు. రూ.5 లక్షలు దాటి తయారీ రంగంలో పరిశ్రమలకు, రూ.2 లక్షలు దాటిన సేవా రంగంలో పరిశ్రమలకు కనీసం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం



వీఆర్ఎస్ జలాశయం

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ నెల 16 నుంచి నవంబర్ 24వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 75 మీడియం, 538 వరకు మైనర్ సంఘాలున్నాయి. కొత్త జిల్లాల ప్రాదిపదికనే ఎన్నికలు నిర్వహించనున్నారు. 16వ తేదీన నోటిఫికేషన్ విడుదలకానుంది. వంద ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న ప్రతి చిన్న నీటి పథకం, మధ్యతరహా, భారీ ప్రాజెక్టులకు కాలువలు, డిస్ట్రిబ్యూటరీల ప్రాతిపదికన సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రధానంగా వీఆర్ఎస్, ఒట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, పారాది ప్రాజెక్టుల పరిధిలో సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయకట్టు సర్వే నంబర్‌లోని రైతుల వివరాలు సేకరించి, ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నారు. ఇందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జేసీ నోడల్ అధికారిగా, సబ్ కలెక్టర్లు డివిజనల్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. సీసీఆర్సీ కార్డులున్న కౌలు రైతులనూ ఓటర్ల జాబితాలో చేర్చనున్నారు.

జీసీసీ వ్యాపార లక్ష్యం రూ.61.85 కోట్లు
- జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర



గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద పంచదార నిల్వను పరిశీలిస్తున్న డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీసీసీ వ్యాపార లావాదేవీల లక్ష్యం రూ.61.85 కోట్లని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఇండేన్ గ్యాస్ గోదాం, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకును బుధవారం పరిశీలించారు. నిల్వలు, అమ్మకాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఆర్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు, అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు, గ్యాస్, పెట్రోల్, సూపర్ బజార్లతో ఇప్పటివరకు రూ.22 కోట్ల లావాదేవీలు నిర్వహించినట్టు వెల్లడించారు. మార్చి 2025 నాటికి లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డీఆర్ డిపోలు, గోదాంల నిర్మాణం కోసం రూ. 4.10 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఆయన వెంట ఎంఎల్ఎస్ గోదాం సూపరింటెండెంట్ సాంబశివరావు ఉన్నారు.



సామూహిక అక్షరాభ్యాసానికి చిన్నారులతో పాటు హాజరైన తల్లిదండ్రులు





అమ్మవారిని స్మరిస్తూ అక్షరాలను దిద్దించాలని చెబుతున్న అర్చకుడు

సరస్వతీ నమస్తుభ్యం..!
విజయనగరం రింగురోడ్డు సమీపంలోని ఎస్‌వీఎన్ నగర్‌లో ఉన్న జ్ఞానసరస్వతీ ఆలయంలో బుధవారం అక్షర మంత్రం ప్రతిధ్వనించింది. మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని చదువుల తల్లి సమక్షంలో పిల్లలతో తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించారు. అక్షర మంత్రోపదేశం చేశారు. శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో సాగిన సామూహిక అక్షరాభ్యాసాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది తమ పిల్లలతో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. సాయంత్రం అమ్మవారిని సూర్య ప్రభ వాహనంపై తిరువీధి జరిపారు.
– విజయనగరం టౌన్

ఉద్యోగులకు బదిలీలు.. ▶ తమ్ముళ్లకు దసరా మామ్మూళ్లు

- పలు శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీల పర్వం
- రిలీవైనా.. జాయినింగ్ అయినా 'మామ్మూళ్లు' ఇచ్చుకోవాల్సిందే..!
- ఉద్యోగి వద్ద కనీసం రూ.5 వేలు డిమాండ్!
- ఆవేదనలో ఉద్యోగలోకం
- ఇలాంటి దందా ఎన్నడూ చూడలేదంటూ నిట్టూర్పు
- ఉసూరుమంటూనే మమ్మూళ్లు ఇస్తున్న వైనం

అధికారం ఉంది.. ఉన్నకాడికి దండుకోవడానికి ఏ చిన్న అవకాశాన్నీ తమ్ముళ్లు వదులుకోవడం లేదు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఉద్యోగుల నుంచి దసరా మామ్మూళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగి నుంచి కనీసంగా రూ.5వేలు చొప్పున వసూలు చేస్తున్నట్టు సమాచారం. దీనిపై ఉద్యోగలోకం గుర్రుగా ఉన్నా... అధికార బలం ముందు తలవంచి.. అడినంత ఇచ్చుకుంటోంది. ప్రస్తుతం మన్యం జిల్లాలో ఏ ఇద్దరు ఉద్యోగులు కలిసినా ఈ విషయంపై మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది.



సాక్షి, పార్వతీపురం మన్యం:

ఇటీవల పలు శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. ఇప్పుడిప్పుడే ఉద్యోగులు రిలీవవుతున్నారు. బదిలీపై వచ్చిన వారు కొత్త ప్రదేశంలో విధుల్లో చేరుతున్నారు. బదిలీల ప్రక్రియలో సిఫారసు లేఖలు.. అడిగినంత మొత్తం ఇచ్చుకోవడం ఒక ఎత్తయితే... ఇప్పుడు మండల స్థాయిలో తెలుగు తమ్ముళ్లు మరో కొత్త 'మామ్మూళ్ల'కు తెర తీసినట్టు తెలుస్తోంది. ఎలానూ దసరా పండగ వస్తోంది.. ఈ నెపంతో నాలుగు రాళ్లు వెనకేసుకోవాలనుకున్నారో ఏమో గానీ, ఉద్యోగుల వద్ద వసూళ్లకు దిగారు. బదిలీపై ఓ ఉద్యోగి వెళ్తున్నా, మరో ఉద్యోగి కొత్తగా ఆ స్థానంలోకి వస్తున్నా కనీసం రూ.5 వేలు చెల్లించాలని పట్టుపడుతున్నట్లు భోగట్టా. మండలానికి రూ.10 లక్షలైనా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారట. సచివాలయాలు, ఎంపీడీఓ, రెవెన్యూ కార్యాలయాలు.. ఇలా ఏ విభాగాన్నీ వదిలిపెట్టడం లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రధానంగా సచివాలయాలపైనే దృష్టి పెట్టినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగుల విషయంలో తమకు చెప్పకుండా ఎవరినీ విధుల్లో నుంచి రిలీవ్ చేయవద్దని, చేర్చుకోవద్దని ఇప్పటికే పలు చోట్ల ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇదే బూచిగా చెబుతూ 'చిన్న తమ్ముళ్లు' వసూళ్లకు పాల్పడుతున్నారు. చిరుద్యోగి నుంచి పెద్ద ఉద్యోగి వరకు ఎవరినీ వదిలిపెట్టడం లేదని సమాచారం. ఆ విభాగ అధికారులకే ఈ బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. ఇదేంటని ఉద్యోగులు ప్రశ్నిస్తే.. 'మీ బదిలీల కోసం చాలా కష్టపడ్డాం. ఆ మాత్రం ఇచ్చుకోలేరా?' అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని తెర మీదకు తెస్తున్నారని పలువురు సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. అధికార పార్టీలో ఉన్న రాజకీయ నాయకులతో ఎందుకులే అని ఉద్యోగులు కూడా ఆ మొత్తం ఇచ్చేస్తుండగా.. తమ్ముళ్ల దందాపై కొందరు బహిరంగంగానే దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ విషయంపై ప్రస్తుతం ఉద్యోగుల కుటుంబాల్లో కూడా చర్చసాగుతోంది. ఇన్నేళ్లుగా బదిలీలు, కొత్త పోస్టింగ్‌లలో చేరడంవంటివి జరిగినా ఉద్యోగుల నుంచి మామ్మూళ్లు వసూలు చేయడం ఇదేతొలిసారి అంటూ వాపోతున్నారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు



పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు బుధవారం దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పోలమాంబ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సప్త ప్రాకారసేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు ముందుగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పట్టు శాలువతో సత్కరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు పూడి దాలినాయుడు, గంజి కాశినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శంబర పీహెచ్‌సీ తనిఖీ
ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు శంబర పీహెచ్‌సీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ వివరాలను డాక్టర్ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

జాబ్ క్యాలెండర్ ఏదీ?

- ప్రచారం కోసమేనా కూటమి నేతల హామీలు
- నిరుద్యోగ యువత భవిష్యత్ ఏంటి?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని.. భవిష్యత్‌కు తమది హామీ అని.. ఉద్యోగాలు కల్పించేవరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీలిచ్చారు.. అధికారంలోకి వచ్చి సుమారు నాలుగు నెలలు కావస్తున్నా కనీసం జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరులోని తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పండగ చేసుకున్నా నిరుద్యోగులు గుర్తుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌లు నిరుద్యోగ యువతకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తుచేశారు. 2023లో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ కూడా జారీ చేసిందన్నారు. 2024 జూలైలో గ్రూప్-1, సెప్టెంబర్‌లో గ్రూప్-2 మెయిన్ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా తాత్సారం చేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అటవీశాఖలో 600 ఉద్యోగాలు, పోలీస్ శాఖలో వేలాది ఉద్యోగాలు నోటిఫికేషన్లు జారీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి గత ప్రభుత్వం విడుదల చేసిన 10 వేల పోస్టుల నోటిఫికేషన్‌కు మరో 6 వేల పోస్టులు కలిపి 16వేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందని వివరించారు. ఈ విధంగా చూసుకుంటే కూటమి ప్రభుత్వం 6 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చినట్లు అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు తక్షణమే ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలుచేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని యువత నిలదీయాలని కోరారు.

14న నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా
విజయనగరం: విజయనగరంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే మేళాలో ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. బయోడేటా, సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 98491 18075 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పేదలకు ఉచిత బియ్యం పథకం పొడిగింపు
సాక్షి, పార్వతీపురం మన్యం: పేదలకు ఉచితంగా బియ్యం అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. 2028 డిసెంబర్ వరకు పెంచుతూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కోవిడ్ సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం/ఆహార పదార్థాలు అందిస్తున్న విషయం విదితమే. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొన్నాళ్లపాటు.. అటు రాష్ట్ర వాటాగానూ, ఇటు కేంద్ర వాటా గానూ నెలలో రెండుసార్లు కార్డుదారులకు బియ్యం అందజేసేది. జిల్లాలో 2.81 లక్షల రేషన్ కార్డుదారులుండ గా.. ప్రతి నెలా 5,251.345 మెట్రిక్ టన్నుల వరకు బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో బియ్యం కార్డుదారులకు మరికొన్ని ఏళ్లపాటు లబ్ధి కలగనుంది.

చేపల పెంపకానికి చేయూత

- ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు రాయితీలు
- ఎస్టీ మత్స్యకార రైతులకు 60 శాతం..
- బీసీ మత్స్యకార రైతులకు 40 శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీ
- తోటపల్లి రిజర్వాయర్‌లో 10 లక్షలు
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 21 లక్షలు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 14 లక్షల సీడ్ విడుదలకు కసరత్తు
- నవంబర్‌లో సీడ్ స్టాకింగ్ ప్రారంభం

పాలకొండ రూరల్:

మత్స్యకారులకు శుభవార్త. రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎస్‌వై) పథకం కింద ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని తోటపల్లి, వెంగళరాయసాగర్, గుజ్జువాయి, వట్టిగెడ్డ రిజర్వాయర్లతో పాటు 109 సాగునీటి చెరువుల్లో చేపల పెంపకానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మత్స్యకారులను గుర్తించారు. చేప పొదుగు (హేచింగ్), చిచ్చుర పిల్లలు (రేగింగ్) సాకడానికి నర్సరీలు సిద్ధం చేస్తున్నారు.



సీతంపేట ఐటీడీఏ పరిధిలో సిద్ధం అవుతున్న మత్స్య సంపద



ప్రభుత్వ చేపపిల్లల పెంపకం కేంద్రం దుమ్మంగిలో సిద్ధమైన సీడ్

45 లక్షల సీడ్ విడుదలకు చర్యలు
జిల్లాలో గుమలక్ష్మీపురం మండలం దుమ్మంగి ప్రభుత్వ చేపపిల్లల పెంపకం కేంద్రం ద్వారా శత శాతం రాయితీపై ఉచితంగా 10 లక్షల కట్ల, రాగండి, ఎర్రమైల జాతులకు చెందిన చేప పిల్లలను (ఫింగర్ రింగ్స్ సైజ్ సీడ్) ఈ నెల 25వ తేదీ లోగా తోటపల్లి రిజర్వాయర్‌లో విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏసీఏ, టీఎస్ఎస్ ద్వారా పాలకొండ నియోజకవర్గ పరిధిలో 15 లక్షల (బొచ్చు, రాగండి, గడ్డి, ఎర్రమైల) జాతులకు చెందిన చేప పిల్లలను 555 చెరువుల్లో విడిచిపెట్టనున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఏసీఏ, టీఎస్ఎస్ ద్వారా 9 టీఎస్పీ మండలాల్లో 21 లక్షల చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకుని వచ్చేనెలలో సీడ్ స్టాకింగ్ మొదలుపెట్టనున్నారు.

జిల్లాలో మత్స్యకార సొసైటీలు	35	సొసైటీల్లో సభ్యుల సంఖ్య	4,655		
మత్స్యమిత్ర (మహిళా) సొసైటీలు	8	మహిళా సభ్యుల సంఖ్య	488		
సొసైటీ చెరువులు	110	గ్రామపంచాయతీ లీజు చెరువులు	75	రిజర్వాయర్లు	4
ప్రభుత్వ చేప పిల్లల పెంపకం కేంద్రం: దుమ్మంగి					

పీఎంఎంఎస్‌వై పథకం కింద..



పీఎంఎంఎస్‌వై పథకం కింద జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీకి కసరత్తు ప్రారంభించాం. ఈ క్రమంలో కమిషనర్ ఆఫ్ ఫిషరీస్, కలెక్టర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం తెలిపిన వెంటనే నవంబర్‌లో సీడ్ స్టాకింగ్ మొదలు పెడతాం. జిల్లాలో మత్స్య సందప, ఔత్సాహిక రైతులు, సొసైటీల బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే రాయితీలపై అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం.
– వేముల తిరుపతయ్య, జిల్లా మత్స్య శాఖాధికారి, పార్వతీపురం మన్యం

- జిల్లాలో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం: 1,75,485 ఎకరాలు
- శతశాతం ఈ-క్రాప్ నమోదు
- వరి పంట దిగుబడి అంచనా: 3,57,921 మెట్రిక్ టన్నులు
- ధ్యానం కొనుగోలుకు అనుసంధానం చేయనున్న మిల్లులు: 93

ధాన్యం కొనుగోలు లక్ష్యం... 2.70 లక్షల మెట్రిక్ టన్నులు



ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగులో ఉన్న వరి పంట

వీరఘట్టం: ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చింది. ఇప్పటికే తేలిక వరి రకాలు కోతకు వచ్చాయి. మరో నెల రోజుల్లో పంట చేతికందనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతుల పండించిన ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని 183 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ధాన్యం మర పట్టించేందుకు 93 మిల్లులను కూడా గుర్తించింది. ఈ ఏడాది జిల్లాలో 1,75,485 ఎకరాల్లో వరి సాగు చేయగా.. పంట వివరాలను వ్యవసాయ అధికారులు ఈ క్రాప్‌లో శతశాతం నమోదుచేశారు. జిల్లాలో 3,57,921 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందులో తిండి గింజలు మినహాయించి 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు సిద్ధంచేసింది.

తగ్గిన దిగుబడి...
ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట తొలుత ఆశాజనంగా ఉన్నా, పొట్టదశలో కురిసిన వర్షాలకు దిగుబడి తగ్గుతోందని ఇటీవల కొన్ని ప్రాంతాల్లో చేపట్టిన వరి కోతల ద్వారా నిర్ధారణ అయింది. గతేడాది జిల్లా వ్యాప్తంగా సరాసరి 25 బస్తాల (80 కిలోలు) దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 20-22 బస్తాల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గత రెండు నెలలుగా ఈ-క్రాప్‌లో వరి పంట వివరాలను నమోదు చేసిన వ్యవసాయశాఖ అధికారులు పంటల దిగుబడిని కూడా అంచనా వేసి పౌర సరఫరాల శాఖకు నివేదించారు. గతేడాది సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2,183కు, గ్రేడ్-1 రకం ధాన్యం రూ.2203కు కొనుగోలుచేశారు. ఈ ఏడాది సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2300కు, గ్రేడ్-1 రకం ధాన్యం రూ.2320లకు కొనుగోలు చేయనున్నట్టు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది.

క్లుప్తంగా

ఎన్‌సీసీ అధికారి పర్యటన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఉభయరాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్‌సీసీ అనేది మంచి నడవడిక నేర్పుతుందని ఉభయరాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీ.ఎం.రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన కోరుకొండ సైనికపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసి వారితో ముచ్చటించారు. ఎన్‌సీసీతో పాటు రక్షణ రంగంలో ఎలా ప్రవేశం పొందవచ్చో, అలాగే వాటి ప్రాముఖ్యత ఎలా ఉంటుందో విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: భామినిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ కెమిస్ట్రీ ఒక పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 వ తేదీలోగా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పీజీ ఇన్ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీలో కనీసం 50 శాతం మార్కులు, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ, సీట్ పేపర్ 2లో ఉత్తీర్ణత, టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఆంగ్లమాధ్యమం బోధనలో ప్రావీణ్యం ఉండాలని స్పష్టం చేశారు.

పాముకాటుతో రైతు మృతి



దుర్గారావు మృతదేహం

రేగిడి: మండలంలోని నాయిరాలవలస గ్రామానికి చెందిన రైతు రుంకు దుర్గారావు పాముకాటుకు గురై మృతిచెందాడు. దీనిపై కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గారావు ఈనెల 8న తన పొలంలో మేతగడ్డి కోసేందుకు సాయంత్రం వెళ్లగా, దారిలో పాము కాలిపై కాటువేసింది. దీంతో గట్టిగా కేకలు వేయగా, పక్కన పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి వచ్చి 108లో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ వైద్యం అందిస్తుండగానే మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతిచెందాడు. మృతునికి భార్య నారాయణమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతిచెందడంతో కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. ఆ రైతు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వావిలపల్లి వెంకటరమణ తదితరులు పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య



కుమారి మృతదేహం

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన ఊడిగల కుమారి ఆత్మహత్యకు పాల్పడింది. వసాది గ్రామానికి చెందిన చిన్న అనే వ్యక్తితో కొన్నేళ్ల క్రితం కుమారికి వివాహం జరిగింది. వివాహమైన నాలుగేళ్ల తర్వాత భర్తతో కలిసి కన్నవారి గ్రామం పెదవేమలి వచ్చేసింది. దంపతులిద్దరూ ఇక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొద్ది నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 7వ తేదీన కడుపు నొప్పి రావడంతో భరించలేక పురుగుమందు తాగేసింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందింది. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మృతిరాలికి భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు పైడిరాజు



అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన పైడిరాజు

సాలూరు రూరల్: ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు మలేషియాలో జరగనున్న అథ్లెటిక్స్ పోటీలకు సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కనకల పైడిరాజు ఎంపికైనట్లు మామిడిపల్లి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పొట్నూరు శ్రీరాములు తెలిపారు. పైడిరాజు హైదరాబాద్‌లో జరిగిన 200,400,800 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించి, ఈ పోటీలకు ఎంపికైంది. మలేషియాలో బుకిత్ జలిల్ స్టేడియంలో జరగబోవు 36వ మలేషియా ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరపున పాల్గొంటుందని శ్రీరాములు తెలిపారు.ఇదివరకు శ్రీలంకలో జరిగిన పోటీల్లో కూడా ఆమె పాల్గొని ప్రతిభ కనబరిచిందన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ముందు‘చూపు’ అవసరం..!

- సకాలంలో వైద్యం అందితే అంధత్వం దూరం
- ప్రతి ఒక్కరికీ కంటి వ్యాధులపై అవగాహన తప్పనిసరి
- జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు
- నేడు జిల్లాలోని 37 పీహెచ్‌సీల్లో వైద్యశిబిరాలు
- గ్లకోమాపై విస్తారంగా అవగాహన కార్యక్రమాలు
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం



నర్సిపురం పాఠశాలలో నేత్ర పరీక్షల్లో వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్: శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగినా ఆ బాధను కళ్లే వ్యక్తపరుస్తూ ఉంటాయి. ప్రపంచంలో ప్రకృతి అందాలను కళ్లున్న ప్రతి ఒక్కరూ చూసి ఆస్వాదించి మధురానుభూతి పొందుతుంటారు. ఆ కళ్లే కనిపించకపోతే జీవితం అంధకార మవుతుంది. ప్రఖ్యాత రచయిత హెలెన్ కెల్లర్ మాటల్లో చెప్పాలంటే నాకు దేవుడు మూడు రోజులు కంటి చూపును ప్రసాదిస్తే చాలు మీరు ఎవరు జీవితంలో చూడలేనివి నేను మూడు రోజుల్లో చూస్తానన్నారు. 'ఐస్ ఆర్ విండోస్ ఆఫ్ ద సోల్' కళ్లు తెరిస్తే ప్రపంచం మనముందుంటుంది, ఆ కళ్లే మూసుకుంటే అంతా అంధకారమే. పార్వతీపురం మన్యం జిల్లాలోని 37 పీహెచ్‌సీల్లో నేత్ర వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నారు. నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం.

అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదం

వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు ఉష్ణోగ్రతలు పెరిగి ఆవేడికి కన్ను పొడిబారి కంటి సమస్యలు ఏర్పడి చూపు కోల్పోయి అంధత్వానికి దారి తీస్తుంది. మనిషి నిమిషానికి ఎనిమిది సార్లు కంటి రెప్పలు ఆర్పుతూ ఉంటాడు. అలా చేయడం ద్వారా కార్నియాకు (నల్లగుడ్డు) అవసరమైన నీరు చేరి కళ్లు ఎండిపోకుండా చేస్తుంది. ఈ కాలంలో ప్రయాణిస్తున్న వారికి వేడిగాలుల దృష్ట్యా తడి ఆరిపోయి కంటిలో లూబ్రికేటింగ్ (సరళత) తగ్గి దురద పెరిగి చూపుడు సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది. వేసవి ప్రయాణంలో కంటి రెప్పలు నిమిషానికి రెండు నుంచి మూడుసార్లు మాత్రమే కొట్టుకుంటూన్నాయని ఒక సర్వేలో వెల్లడించారు. దీని ఫలితంగా కంటి సమస్యలు వచ్చి చూపు తగ్గే అవకాశం, తీవ్రమైన తలనొప్పి వచ్చే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి.

నేడు జిల్లా వ్యాప్తంగా శిబిరాలు

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత నేత్ర వైద్య సేవలు అందించేందుకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష కంటి వెలుగు కార్యక్రమంలో బాగంగా గ్రామాలలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేసి కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం(కొయ్య కండ) గుర్తించాం. జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య విభాగంలో రోజువారీ నేత్ర పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వారికి ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిర్వహిస్తున్నాం.



డాక్టర్. నగేష్ రెడ్డి,
జిల్లా అంధత్వ నివారణ అధికారి

పూర్తి పరీక్ష చేయించుకోవడం ఉత్తమం

గ్లకోమాను కనుగొనడానికి కంటి వైద్యుడితో పూర్తి పరీక్షలు చేయించు కోవడం ఉత్తమమార్గం. సంపూర్ణ కంటి పరీక్షలో కంటి ఒత్తిడి (ఐఓపి) కొలత, కంటి డ్రైనేజ్ ప్రక్రియ,ఆప్టిక్ నరాన్ని పరీక్షించడం, కంటి విజువల్ ఫీల్డ్ పరీక్షల ద్వారా కంటి చూపును పరిశీలించి గ్లకోమాను గుర్తిస్తారు.

గ్లకోమాకు చికిత్స

ఈ వ్యాధి వచ్చినట్లు గుర్తించిన వెంటనే కంటి ఒత్తిడిని తగ్గించడమే దీనికి ప్రధాన చికిత్స. దీర్ఘకాలిక నియంత్రణకు కంటి చుక్కల మందు, మాత్రల వాడకం చాలా ముఖ్యం. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స కూడా చేయవలసి వస్తుంది. క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి. గ్లకోమాను ముందుగా పసిగడితే వైద్యం ద్వారా కళ్లను కాపాడుకోవచ్చని కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి డా.నగేష్ రెడ్డి తెలిపారు.

పొడిబారిన కన్ను లక్షణాలు

వెలుతురులో కళ్లు స్పష్టంగా కనబడకుండా ఉండడం నిలువుగా ఉన్న వస్తువులు, వైర్లు, గీతలు వంగినట్లుగా కనిపించడం, కళ్లముందు ఉన్న ప్రదేశంలో చుక్కలుగా కనిపించడం, ఒకే వస్తువు రెండుగా కనిపించడం, దీపం గాని బల్బ్ గాని దాని చుట్టూ ఇంద్రధనుస్సులాగా రంగులు కనిపించడం, కంప్యూటర్‌పై పనిచేస్తున్న వారికి తీవ్రంగా తలనొప్పి, కళ్లు తిరగడం, దురద, మంట, నీరు కారడం తదితర లక్షణాలుంటే వెంటనే నేత్ర వైద్యులని సంప్రదించి తగు చికిత్స పొందుతూ కంటి చూపు కాపాడుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

వేసవి కాలంలో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా కళ్లజోళ్లు ధరించాలి. ప్రయాణంలో సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి. కంప్యూటర్ వద్ద గంటల కొద్దీ గడపరాదు.కంటి రెప్పలు ఎక్కువ సార్లు కొట్టుకొనే విధంగా ప్రయత్నించాలి. తరచూ ముఖాన్ని చల్లని నీటితో కడుక్కునే ప్రయత్నం చేయాలి. కంటికి దురదలు వచ్చే సమయంలో చేతితో నలపరాదు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ కళ్లపై అత్యంత శ్రద్ధ వహించి కంటికి ఎక్కువ వేడి తగలకుండా కళ్లజోళ్లు ధరించి చూపు కాపాడు కోవాలి.

గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి

- విశాఖ రేంజ్ ఎస్పీలతో జూమ్‌మీటింగ్‌లో డీఐజీ



విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రేంజ్ పరిధి ఎస్పీలు

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే విధంగా చర్యలు చేపట్టాలని విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం జిల్లాల ఎస్పీలతో బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగం చేయడం వల్ల విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను వివరించాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన చేపట్టాలని చెప్పారు. ప్రతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని, ఆధునిక సాంకేతికను, స్నిఫర్ డాగ్స్‌తో ఇప్పటికే గుర్తించిన హాట్‌స్పాట్‌ల వద్ద తనిఖీలు చేపట్టాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాకు తరచూ పాల్పడే వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని స్పష్టం చేశారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లు తనిఖీ చేసి, వారి లైసెన్స్‌లను పరిశలించాలని, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన

సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించాలని డీఐజీ సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలు సైబర్ నేరాలకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక, ఏఎస్‌ఆర్ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, శ్రీకాకుళం ఎస్పీ కేవీ.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ. మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

- శాస్త్రోక్తంగా జరిపించిన అర్చకులు



స్వామిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అర్చకులు



వెండి మంటపం వద్ద వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతా రామస్వామివారి సన్నిధిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. సాక్షాత్తు తిరుమలలో జరుగుతున్న విధంగా వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి రామతీర్థంలో కనులపండువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తరువాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించి స్వామివారిని రామతీర్థం తిరువీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అర్చకులు గ్రామ అష్ట దిక్కులకు స్వామివారిని తీసుకువెళ్లి గ్రామ బలిహరణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించి మంగళాశాసనం కార్యక్రమం నిర్వహించారు.

కనులపండువగా కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామతీర్థం దేవస్థానం అర్చకులు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. యాగశాలలో విశిష్ట హోమాలను జరిపించిన తరువాత స్వామివారిని ఆస్థాన మంటపంలోకి తీసుకువచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం (స్థల, దేహశుద్ధి) తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు స్వామివారికి సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ సాయంత్రం 4గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం యజ్ఞోపవీత ధారణ చేపట్టి తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

12న చక్రస్నానం

శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న స్వామివారికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ఆఖరి ఘట్టమైన ధ్వజావరోహణ జరిపించి మొదటి రోజు ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడు చిత్రపటాన్ని కిందకు దింపి బ్రహ్మోత్సవాలను పూర్తిచేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీరామచంద్ర ప్రభువును అదే రోజు సాయంత్రం జమ్మివేటకు తీసుకువెళ్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జీవనోపాధుల కార్యక్రమంపై సంబంధిత శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా కొత్త పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే కొత్త యూనిట్ల సమాచారం కోసం ఐటీడీఏ కార్యాలయంలో గల జీవనోపాధుల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్త యూనిట్ల స్థాపనలో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం, ఇతరులకు 15శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన కింద చేతివృత్తుల కళాకారులకు తగిన శిక్షణ ఇచ్చి రూ.15వేలు విలువచేసే కిట్‌లతోపాటు కొత్త యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంఈడీపీ, ఎల్ఈడీపీ ప్రోగ్రాంలపై శిక్షణ ఇచ్చి జీవనప్రమాణాలు మెరుగుపరుచుకునేలా చేయాలని నాబార్డ్ ఏడీఎం దినేష్‌కుమార్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ 1 నాటికి అన్ని మండలాల్లో మోడల్ వీడీవీకేలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎంవీ.కరుణాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తుచర్యలు

జిల్లాలో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డీఈఓ జి. పగడాలమ్మ, డీఎల్‌ఏటీఓ డా.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధురస్మృతిలా విజయనగర ఉత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



హాజరైన జిల్లా అధికారులు

- ఉత్సవాల ప్రారంభానికి స్పీకర్ రాక
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిలా నిలిచిపోయేలా నిర్వహించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉత్సవాల ఏర్పాట్లను చూసి అధికారులతో మాట్లాడి ఉత్సవాలు ఘనవిజయం అవుతాయనే నమ్మకం కలిగిందన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, కలెక్టర్ అంబేడ్కర్‌లు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేస్తున్న మొట్టమొదటి కార్యక్రమం, అత్యంత ప్రతిష్టాత్మకంగా, వైభవంగా నిర్వహించాలని కోరారు. అధికారులు వారికి కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించి పండగను, ఉత్సవాలను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొత్తం ఉత్సవ కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేయాలని, ఎక్కడైనా పొరపాట్లు జరిగినా వచ్చే ఏడాదికి వాటిని సరి దిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. 11వ తేదీ సాయంత్రానికే నగరమంతా లైటింగ్ ఏర్పాట్లు జరగాలని గురువారం లోగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు స్పష్టం చేశారు. కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ అన్ని వేదికలలో ఇన్‌చార్జ్ అధికారులు లైఫ్ మెంబర్లతో కలిసి సమన్వయం చేసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పని చేయాలని ఆదేశించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఉత్సవాలు, పండగకు 2 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లను, టీజర్లను మంత్రి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ అనిత, ఆర్డీఓ కీర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దత్తిరాజేరు: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాడంగి మండలం పాల్తేరు గెడ్డ నుంచి అక్రమంగా దత్తి గ్రామానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను షికారుగంజి, రామచంద్రాపురం గ్రామాల వద్ద పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు పట్టుకుని సీజ్ చేయడం జయనున్నట్లు హెచ్చరించారు.

అందరి భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి

విజయనగరం రూరల్: అందరి భాగస్వామ్యంతోనే పంచాయతీల్లో అభివృద్ధి శతశాతం సాధ్యపడుతుందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు బుధవారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణనుద్దేశించి ఆయన మాట్లాడారు. శిక్షణలో పంచాయతీ విధులు, అధికారాలు, బాధ్యతలు, నిర్వహణ, విధివిధానాలు అభివృద్ధిలో భాగస్వామ్యం పాత్ర వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. వీటన్నింటిని బాగా నేర్చుకుని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామ స్వారాజ్య స్థాపనే ధ్యేయంగా ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టయితే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుదన్నారు. ఎంపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల్లో ముందుగా 12 పంచాయతీలకు సంబంధించిన వార్డు మెంబర్లు, ఉప సర్పంచులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిదులు ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వాటిని గ్రామ అభివృద్ధికి కమిటీ తీర్మానాలు చేసి వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ : గ్రామాలను అభివృద్ధి పథంలో పయనింపజేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వైస్ సర్పంచ్‌లకు పంచాయతీలు అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో నిధులు వినియోగం, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పంచాయతీ అధికారి జి.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ 15, 16వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ వినియోగంపై అవగాహన కల్పించారు.

గంజాయి కేసులో ఎనిమిది మంది అరెస్ట్



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై గణేష్

- రూ.40వేలు విలువైన 8కిలోల గంజాయి,
- రెండు మోటార్ సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్‌ల సీజ్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాను కూకటివేళ్లతో నియంత్రించి, సరఫరా చేస్తున్న నిందితులను అరెస్టు చేయాలనే సంకల్పంతో ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఎప్పటికప్పుడు ఇస్తున్న ఆదేశాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం నెల్లిమర్ల మండల కేంద్రంలోని చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఎనిమిది కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్‌లను నెల్లిమర్ల పోలీసులు సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం మాట్లాడుతూ అరెస్టు చేసిన గంజాయి నిందితుల్లో అనకాపల్లి జిల్లా, చోడవరం గ్రామానికి చెందిన సురభి పార్థసారధి (ఎ1), జ్యోతుల బద్రినాథ్(ఎ2), అల్లూరి సీతారాజు జిల్లా, పాడేరు మండలానికి చెందిన కొర్ర భాస్కరరావు(ఎ3), కృష్ణాజిల్లా కానూరు గ్రామానికి చెందిన గుంటూరు తేజ (ఎ4), నెల్లిమర్ల మండలం దివకుల పేటకు చెందిన కురుమనెల్లి గణేష్ (ఎ5), విశాఖ సిటీ శివాజీపాలానికి చెందిన దొప్ప అనుదీప్ (ఎ6), విశాఖ సిటీ పాండురంగాపురానికి చెందిన సామిరెడ్డి రఘు చరణ్ (ఎ7),విజయనగరం శివాలయం వీధికి చెందిన అంధవరపు ఈశ్వరరావు (ఎ8)లు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులు పార్థసారథి, బద్రినాథ్‌లకు కొర్ర భాస్కరరావు గంజాయి సరఫరా చేసేవాడని విచారణలో వెల్లడైందన్నారు. తేజ, గణేష్ అనుదీప్, రఘుచరణ్, ఈశ్వరరావులు గంజాయి వినియోగానికి అలవాటుపడిన వ్యక్తులుగా గుర్తించి, అరెస్ట్ చేశామని వివరించారు.